# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 20-06-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **విశాఖపట్నంలో రేపు జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారు.**

**2.** **రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.**

3. **దేశంలో ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించడంలో మీడియా రంగం కీలకమైందని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ డైరెక్టర్ పి. పవన్ తెలిపారు.**

**4.** **ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరువ చేయడంలో రెవెన్యూ శాఖ పారదర్శకంగా పని చేస్తోందని మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పేర్కొన్నారు.**

============================

రేపు అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విశాఖపట్నంలో జరిగే కార్యక్రమంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ పాల్గొంటారు. ఈరోజు సాయంత్రం భువనేశ్వర్ నుంచి ప్రధానమంత్రి విశాఖపట్నం చేరుకుని తూర్పునౌకాదళం అతిథి గృహంలో బస చేస్తారు. రేపు ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి 7 గంటల 45 నిమిషాల వరకు రామకృష్ణా బీచ్‌లో జరిగే అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమంలో ప్రధానమంత్రి పాల్గొంటారు.

ప్రధానమంత్రి పర్యటనకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తిచేసింది. రేపటి యోగా దినోత్సవ వేడుకల్లో ప్రధానమంత్రితో పాటు రాష్ట్ర గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి కె.పవన్ కళ్యాణ్ పాల్గొంటారు.

కాగా.. ఈరోజు విశాఖపట్నంలోని బీచ్ రోడ్డులో అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకల సన్నాహాక కార్యక్రమాలను నిర్వహించారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవం పురస్కరించుకుని రేపు రాష్ట్ర వ్యాప్తంగా యోగాంధ్ర కార్యక్రమాలు జరగనున్నాయి. ఆయా జిల్లాల్లో జరిగే కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు, స్థానిక పార్లమెంటు సభ్యులు, శాసన

సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని యోగాసనాలు వేయనున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో 2 కోట్ల మంది యోగా దినోత్సవంలో పాల్గొనేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేసింది.

కాగా.. గత నెలరోజులుగా యోగాను ప్రజలకు చేరువ చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం పలు కార్యక్రమాలను నిర్వహించింది. వివిధ స్థాయిల్లో యోగాకు సంబంధించి పలు పోటీలు నిర్వహించి జిల్లాకు ఒక ఇతివృత్తం ఆధారంగా యోగా ప్రదర్శన నిర్వహించింది.

ఇలా ఉండగా ఈరోజు సాయంత్రం విశాఖపట్నంలో 25 వేలమందికి పైగా గిరిజన విద్యార్థులతో 108 నిమిషాల పాటు 108 సూర్య నమస్కారాలను చేసేలా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నారు.

---------------------------

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం యోగాంధ్ర-2025 పేరుతో నెలరోజులపాటు రాష్ట్ర వ్యాప్తంగా పలు కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఇందులో భాగంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడలోని ఏపీ ఛాంబర్ ఆఫ్ కామర్స్ ప్రతినిధులతో జరిగిన యోగాంధ్ర కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ జి. లక్ష్మీశ పాల్గొని యోగసనాలు అభ్యసించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ..

..వాయిస్... 28 సెకన్లు

---------------------------

యోగా అందరి జీవన విధానంలో భాగం కావాలని ప్రకాశం జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అన్నారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘం డ్వాక్రా మహిళలతో యోగా సాధన కార్యక్రమాన్ని ఒంగోలులో ఈరోజు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 5వేల మంది మహిళలు పాల్గొని యోగాసనాలు వేశారు. జిల్లాలో 11లక్షల మంది యోగా సాధన కోసం నమోదు చేసుకున్నారని కలెక్టర్ తమీమ్ అన్సారియా చెబుతూ..

వాయిస్ 34 సెకన్లు

---------------------------

దేశంలో ఎన్నికలు పారదర్శకంగా, నిష్పక్షపాతంగా, శాంతియుతంగా నిర్వహించడంలో మీడియా రంగం కీలకమైందని కేంద్ర ఎన్నికల సంఘం డిప్యూటీ డైరెక్టర్ పి. పవన్ తెలిపారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో ఆయన ఈరోజు పాత్రికేయులతో మాట్లాడుతూ.. ఎన్నికల ప్రక్రియను ప్రజలకు చేరువ చేసేందుకు కొత్తగా 23 సంస్కరణలు తీసుకువచ్చామని తెలిపారు. ఒక పోలింగ్ కేంద్రంలో గరిష్టంగా 1200 మంది ఓటర్లకు మాత్రమే అనుమతి ఉంటుందని తెలిపారు.

---------------------------

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుల సంక్షేమం కోసం పలు పథకాలను అందుబాటులోకి తీసుకొచ్చాయని శ్రీకాళహస్తి శాసనసభ్యులు బొజ్జల సుధీర్ రెడ్డి తెలిపారు. తిరుపతి జిల్లా తొట్టంబేడు మండలం చిన్న కనపర్తి గ్రామంలో కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న డ్రోన్ లు, వ్యవసాయ యాంత్రిక పరికరాలను రైతులకు ఆయన ఈరోజు అందజేశారు. కేంద్ర ప్రభుత్వం 80 శాతం రాయితీతో డ్రోన్లు అందిస్తోందని ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి చెబుతూ..

వాయిస్ .. 37 సెకన్లు

---------------------------

రాష్ట్రవ్యాప్తంగా ఈరోజు రెవెన్యూ దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా రెవిన్యూ ఉద్యోగుల బాధ్యతలు, అందించే సేవలపై ప్రత్యేక అవగాహనా కార్యక్రమాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా కృష్ణాజిల్లా మచిలీపట్నంలో రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు వల్లభనేని బాలశౌరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజా వ్యవస్థలో రెవిన్యూ శాఖ కీలకమైందని పేర్కొన్నారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు  అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

ఎగువన కురుస్తున్న వర్షాలకు కృష్ణా నదిలో వరద ప్రవాహం పెరగడంతో శ్రీశైలం జలాశయానికి వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 885 అడుగులు కాగా ప్రస్తుతం 847 అడుగులకు చేరుకుంది. జలాశయం పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 215 టీఎంసీలు కాగా ప్రస్తుతం 72.5 టీఎంసీలుగా ఉందని అధికారులు తెలిపారు.

---------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితి గురించి అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి ఎల్. నారాయణ ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్...27 సెకన్లు

=====================